# కరెక్ట్ సైజ్

వాళ్ళు పిలవాలేగానీ సాధారణంగా ఏ పెళ్ళి 'మిస్' అవ్వను. అందర్నీ కలపవచ్చు. ఆనందంగా గడపవచ్చు. మా కజిన్స్ పదిమంది దాకా వున్నారు. వాళ్ళందరూ వస్తేచాలు సందడికి!

లత పెళ్ళికి అందరం వెళ్ళాం. అనుకున్న దానికన్నా ఆనందంగా లగ్నం అయిపోయింది. భోజనాలకి టైముండడంతో అందరం వాకిట్లోకి చేరాం. పెళ్ళికి వచ్చిన వాళ్ళందరూ చెప్పులు అక్కడ విడిచే లోపలికి వెళ్ళారు.

రకరకాల చెప్పుల్ని చూడగానే నాకో చిలిపి ఆలోచన వచ్చింది.

"రాఘవా! నీ చెప్పులు పాతవైపోయినట్లున్నాయిగా. వీటిలో ఏవి బావున్నాయో ఏరుకో.." మా పిన్ని కొడుకుతో అన్నాను.

"నాకు ఆ బ్రౌన్ కలర్ చెప్పల్స్ బావున్నాయ్!" వెంటనే ఓ జతను సెలెక్ట్ చేసేసుకున్నాడు రాఘవ.

మా గోలలో-గుమ్మం దగ్గర అలా నిలుచుని గొడవచేస్తున్న మేము బయటికి వచ్చే వాళ్ళకి అడ్డమేమో అనే విషయం కూడా ఆలోచించలేదు.

పెద్దవాళ్ళయితే ఏదో చిన్న పిల్లలులే అని మమ్మల్ని తప్పించుకుని అటో ఇటో వెళ్ళిపోతున్నారు. ఉత్సాహం వున్న కుర్రాళ్ళయితే మాతో జాయిన్ అయిపోతున్నారు.

నవ్వులు....కేరింతలు....!

''ప్చ్...లాభంలేదు. చెప్పులు బావున్నాయి కాని చిన్నవై పోయాయి.'' వాటిని అక్కడే విడిచేస్తూ నిట్టూర్చాడు రాఘవ.

''నీకు సరిపోతాయేమో చూడరా వేణూ!..'' తన పక్కనే వున్న వేణుతో అన్నాడు రాఘవ.

''బాడ్‌లక్. పెద్దవయ్యాయి.''

''శ్రీనూనీకో...?''

ఇలా ఒకళ్ళ నొకళ్ళు ప్రశ్నించుకుని అక్కడున్న అందరం చూశాము. కానీ ఎవరికీ సరిగా సరిపోలేదు.

అంతవరకూ మాటా పలుకూ లేకుండా కళ్ళతోనే తన ఆనందాన్ని వ్యక్తపరుస్తూ మా గోలని గమనిస్తున్న తన పక్కన కూర్చున్న వ్యక్తిని పలకరించాడు వేణు—

''మీకు సరిపోతాయేమో చూడండి మాష్టారూ!'' అంటూ.

అతను లేచి ఆ చెప్పుల్ని తొడుక్కున్నాడు. ఆశ్చర్యం!

అతనికి అద్దినట్లు సరిపోయాయి అవి.

''మీకు చక్కగా సరిపోయాయి, వుంచేసుకోండి మేష్టారూ!'' ఉచిత సలహా పారేశాడు వేణు.

''ఉంచేసుకోక పారేస్తానా? నాలుగుషాపులు తిరిగి వంద రూపాయలు పెట్టి, ఏరి కోరికొన్న చెప్పులు!'' చిన్నగా నవ్వుతూ జవాబిచ్చాడు ఆయన.

మా గోలకి ఒక్కసారి ఫుల్‌స్టాప్ పడ్డట్లయింది. నిముషం పాటు ఎవరినోటా మాట రాలేదు.

*

(స్వాతి సపరివారపత్రిక 29-3-85)